



# ప్రేమించు పెళ్ళికై

క్రోవి రామమోహన శాస్త్రి

సిగరెట్టు ముట్టించి గట్టిగా రెండు దుమ్ము ల్లాగి గాల్లోకి వదిలేడు శేషగిరి. సుబ్బారావు రెప్పలార్పకుండా అతనివైపే చూడసాగేడు. ఆలోచిస్తున్నాడు.

గురుడు దార్లో వడ్డట్టున్నాడు. ఇక మనసు పుస్తకం విప్పుతాడు. దాన్ని తెరిపించటం కోసం మూణ్ణెల్లనించి అష్టకష్టాలూ పడుతున్నాడు. అలనాటి ఆషాఢభూతి గాడిలాగా నమ్మకం పుట్టించుకోడానికి ఎంత శ్రమ పడ్డాడు. ఎన్ని రసాలు ప్రదర్శించాడు ముఖంలో! ఇంత కాలానికి ఫలం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. పులకించేడు సుబ్బారావు. గురుడు శేషగిరి వినిపించబోయే ప్రేమకథా పరిత్సాగర తరంగ ఘోష తన చెవుల తుప్పు దుళ్ళగొట్టేస్తుందనీ, ఊరందరి చెవులూ కొరికెయ్యటానికి ద్వారాలన్నీ తెరిచేస్తుందనీ మురిసిపోయేడు.

"మొదలెట్టండి గురూగారూ!" అన్నాడు సుబ్బారావు మహోత్సాహంతో.

శేషగిరి కళ్ళు ఉన్నట్టుండి శూన్యంలోకి చూడసాగినై. "ప్రేమించు ప్రేమకై అన్నా డో కవిగారు. నా దృష్టిలో అ దొక మహత్తర ప్రేమ సిద్ధాంతం. మార్క్సుకీ, గాంధీకీ ఏమాత్రం తీసిపోదు. అందుకే పూర్తిగా నే నా సిద్ధాంతానికి బానిన నైపోయేను. కనకనే హైస్కూలు చదువు చివరి రోజుల్లో మా కరణంగారి చిన్న కూతురు రంగమణిని గాఢంగా ప్రేమించాను. బ్రహ్మాండమైన ప్రేమలేఖలు శరపరంపరగా రాసి, స్వయంగా ఆమెకి అందించాను. రంగమణి సిగ్గులమొగ్గే అయిపోయింది - అవి అందుకుంటూన్న సమయంలో. ఆ సిగ్గు భరించలేక వాటిని తీసుకుపోయి భద్రంగా వాళ్ళ నాన్న చేతి కిచ్చింది. అంతే! నా తొలి వలపు ప్రళయంగా మారిపోయింది. కరణంగారు నడి రోడ్డులో నన్ను నిలబెట్టి బాదిన వీరబాదుడు నాలో

ఈనాటికి ఒక మధుర విషాద స్మృతిగా నిలిచిపోయింది సుబ్బారావుగారూ!" అంటూ ఆగి, అతి భారంగా నిట్టూర్చేడు శేషగిరి.

"ఈ ముసిలి సన్నాసులకి ప్రేమల ఇంటెన్సిటీ గురించి బొత్తిగా నాలెడ్జి లేదు గురూగారూ! మట్టి బుర్రలు. న న్నడిగితే వెధవ బుర్రల్ని డైనమైట్లెట్టి పేల్చెయ్యమంటాను" అన్నాడు సుబ్బారావు ఆయాస పడిపోతూ. అతగాడు తెగ బాధపడిపోతున్నా డనిపించి, శేషగిరి మిత్రుడి అభిమానానికి కదిలిపోయేడు.

"తరవాత ఇంటర్ ఫస్టియర్లో మేరీ జోసెఫ్‌ని మహా ఇదిగా ప్రేమించేను. మేరీ జోసెఫ్‌కి నా నొక్కుల క్రాఫ్ అంటే చాలా ఇష్టం. రెండు మూడు సార్లు మే మిద్దరం కలిసి సినిమాలకి కూడా వెళ్ళేం సీక్రెట్‌గా. అయితే ఓ రోజు సినిమాహాల్లో ఏ సర్టిఫికెట్ ఇంగ్లీషు సినిమా చూస్తూ మా నాన్నకి దొరికిపోయేం..."

"అంటే మీ నాన్న కూడా ఏ సర్టిఫికెట్ సినిమాకే వచ్చా డన్నమాట!"

"రాబట్టే కదా మా కర్మకాలి దొరికిపోయింది! అగ్గిరుద్రు డైపోయేడు. తెల్లారి ఏడో గంటకల్లా నున్నగా గుండు కొట్టించేశాడు నాకు. అక్కడికీ మా అమ్మ మొత్తుకుంటూనే ఉంది - పాత్రంలా మీ రుంటూ ఉండగానే ఈ దారుణం ఏమిటండీ - అని. వింటేనా? ఆట్టే వాగితే అమ్మ కూడా అదే లైవు నగిషీలు చెక్కిస్తానని గెంతేడు. ఏమైతేనేం లెండి! నా బంగారం లాంటి క్రాఫ్ పోయింది. ఆ వెనక మేరీ జోసెఫ్ కూడా దూరమైంది. జో క్కాదండీ! మేరీ ఫ్రాన్సిస్‌ని లవ్ చేసి పెళ్ళాడేసింది కూడా. నేను మాత్రం మా ఊరి కొండమీద నల్లరాతి బండలా మిగిలిపోయేను" అన్నాడు శేషగిరి.

"అతగాడి క్రాపు మీ క్రాఫ్‌కంటే బావుంటుందా, గురూగారూ?" అడిగేడు సుబ్బారావు కుతూహలంతో.

"బావుండే ఉంటుంది. కాకపోతే నా తల గుండ్రాయిలా నిగనిగ లాడగానే మేరీ ఫ్రాన్సిస్ వెంట ఎందుకు పడుతుంది? ఎనీహౌ! ఐ లాస్ట్ మేరీ ఫరెవర్! దెన్, బియ్యే సెకండియర్లో మా కాలేజ్ బ్యూటీ కామినినీ, ఒకవేళ సక్సెస్ అవలేకపోతే మనను కాపుకుంటుందని మా ఎదురింటి గం.భా.న. సీతమ్మగారి మూడో కూతురు అలివేలు మంగజ్యోతినీ ప్రేమించాను. బాడ్ లక్. రెండూ ఫెయిల్యూర్సే. కామిని అమెరికా బావనో, ఆఫ్రికా ఫ్రెండ్‌నో పెళ్ళాడి అరేబియా వెళ్ళిపోయింది. అలివేలు మంగజ్యోతి హఠాత్తుగా వన్ ఫైన్ డార్క్ నైట్ పక్కింటి కమాలుద్దీన్‌తో లేచిపోయింది. మూడో రోజు పేపర్లో వాళ్ళు రిజిస్టర్ పెళ్ళి చేసుకున్నట్టు ఫోటోతో సహా పడింది. ఆ షాక్‌కి నా కుసుమ కోమలమైన హృదయం తట్టుకోలేక విలవిల్లాడిపోయింది సుబ్రావ్ జీ!" అంటూ వాపోయేడు శేషగిరి.

"క్వైట్ నేచురల్ గురూగారూ! ఒకటా, రెండా? నాలుగు ప్రేమ డిఫీట్స్‌తో ఫీట్స్ చేశారు మీరు. నిజం చెప్పాలంటే మీ మనసు చాలా గట్టిది. నల్లరాతి బండలాంటిదనే చెప్పాలి. కాబట్టి ఇలా మిగిలేరు. నాలాంటి అర్భకుడైతే మాత్రం ఈపాటికి దేవదాసు అవతారం ఎత్తేసేవాడు. మందుదాసు అయిపోయేవాడు. ఆనక శ్మశానంలో పడుకుని జగమే మాయలు పాడేసేవాడు. అదలా ఉంచండి గురూగారూ! ఇంత దారుణం జరిగినా మీరు ఈనాటికీ ప్రేమించు ప్రేమకై సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం, ముప్పై అయిదే ళ్ళొంటిమీది కొచ్చినా బ్రహ్మచారిగా ఉండిపోవడం, మానవేతిహాసంలోనే - అన్‌డౌటెడ్లీ - అపూర్వం! హాట్సాఫ్ టు యు సర్!" అన్నాడు సుబ్బారావు సెల్యూట్ కొడుతూ.

శేషగిరి ఛాతీ పొంగిపోయింది. "మీరు న న్నర్థం చేసుకోవడం నిజంగా నా అదృష్టం సుబ్రావ్ జీ! ఎప్పటికీ నేను నా సిద్ధాంతం విడిచిపెట్టను. నా ప్రేమకోసం ప్రేమించానంటూ ఏ యువతి వచ్చినా కులం, గోత్రం, గత చరిత్రలతో ప్రమేయం లేకుండా పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాను. అది నా ధ్యేయం!" అన్నాడు దృఢంగా.

"అయ్ విష్ యు ఆల్ ద బెస్ట్ గురూగారూ!" అంటూ సుబ్బారావు శేషగిరి చెయ్యందుకుని వీర ఊపుడు ఊపేశాడు చాలాసేపు.

** ** **

ఆగకుండా స్రవిస్తున్న కన్నీళ్ళు తుడుచుకోవాలని కూడా అనిపించడం లేదు పద్మకి. గుండె బరువు దించుకుందుకు ఆమెకి అ దొక్కటే దారిగా కనిపిస్తోంది. నిట్టూర్చింది పద్మ.

ఆమె మనసులో అగ్నిగుండాలు జ్వలిస్తున్నాయి. తను ఆ ఇంట్లో ఒక పూర్ నెగ్లెక్టెడ్ క్రీచర్‌గా భారంగా రోజులు వెళ్ళబుచ్చుతోంది గత కొన్నేళ్ళుగా. డిగ్రీ ఉంది. మంచి ఉద్యోగం ఉంది. నెలకి రెండు వేలు పైనే సంపాదిస్తోంది. తండ్రి సంపాదిస్తున్నదంత తాగుడుకీ, పేకాటకీ తగలెట్టేస్తున్నాడు. ఆయనకి ఇల్లు గడవటం, ఆడపిల్లల పెళ్ళిళ్ళ బాధ్యతలు బొత్తిగా పట్టవు. అసలా ఆలోచననే లే దాయనికి. ఆయన అవసరాలూ, అలవాట్లూ ఆయనకి ముఖ్యం. ఏ పరిస్థితుల్లోనూ వాటికి భంగం కలగకుండా ఆయన జాగ్రత్తలో ఆయ నుంటాడు. పోతే తల్లి. ఆవిడకి నోరే లేదు. భర్తకి ఎదురు చెప్పటం మహాపాపంగా, పాతివ్రత్యానికి భంగంగా భావించే ఇల్లాలు. ఆడపిల్లలు ఎదిగిపోయారనీ, వాళ్ళ పెళ్ళిళ్ళు ఎలా అవుతాయా అని ఇరవై నాలుగ్గంటలూ ఆలోచిస్తూ బెంగతో రోజులు వెళ్ళబుచ్చే అసలు సిసలు ఇల్లాలు. భర్త ప్రవర్తన పట్ల అసహ్యం ఉన్నా పల్లెత్తు మాట మాట్లాడకుండా హృదయాన్ని పగలగొట్టేసే బాధని మౌనంగా భరిస్తూ, లోలోపల క్రుంగిపోయే సహనశీలి.

పోతే తన తరవాత పుట్టిన తమ్ముడు ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రి బాధ్యతా రహితంగా ఉండటం గమనించి తన కోరికలూ,

# హమేషా - తమాషా

డాక్టర్ మహీధర నళినీ మోహన్

## అగ్గిపుల్లల్ని రెట్టింపు చెయ్యడం

ఒక ఖాళీ అగ్గి పెట్టె తీసుకుని అందులోని "ట్రే" కాస్త బయటికి తోసి చూపించు మీ స్నేహితులకి. అది అగ్గి పుల్లలు ఏమీ లేని ఖాళీ పెట్టె అని వారికి నమ్మకం కలుగుతుంది. ఊపి, బోర్లించి కూడా చూపవచ్చు.


వారిలో ఒకరి చేతికి మూడు అగ్గి పుల్లలు ఇచ్చి వాటిని ఆ ట్రేలో వేయమని చెప్పు. వేశాక ట్రేని యథాస్థానంలోకి తోసెయ్యి.

తరువాత ఆ పెట్టెని అటూ, ఇటూ ఊపి, గలగల లాడించి మంత్రం ఏదో చదువుతున్నట్లు నటించి, ఆ పెట్టెను నీ స్నేహితుడి కిచ్చి తెరిచి చూసుకోమని చెప్పు.

అతను ట్రే బయటికి లాగి అందులో ఆరు అగ్గి పుల్ల లుండడం చూసి ఆశ్చర్యపోతాడు.

ఇది ఎట్లా జరిగింది?

"ఖాళీ అగ్గి పెట్టె" అని మీ స్నేహితులకి చూపింతే ముందు మూడు అగ్గి పుల్లలను పై గుల్లకీ, ట్రేకీ మధ్యని బొమ్మలో చూపినట్లు దూర్చి ఉంచు. అవి ఇతరులకు కనిపించవు. తరువాత




ట్రేని యథా స్థానంలోకి తోసేసినప్పుడు దాచిన మూడు పుల్లలూ ట్రేలో పడిపోతాయి. ఈ విధంగా మొత్తం ఆరు పుల్లలు అవుతాయి. ★

ఆడంబరాలూ అవసరాలూ బలవంతాన చంపుకుని, ఇంటి బాధ్యతలు నెత్తిన వేసుకున్నాడు - తనలాగే! తా మిద్దరి సంపాదనే కుటుంబం సాఫీగా సాగటానికి ఆధారం. ఆ సంగతి తెలిసే పెళ్ళి ఊ సెత్తకుండా తల్లి తెగపోరు పెడుతున్నా పెడ చెవిని పెట్టి చెల్లెళ్ళ పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించింది తను. వాళ్ళ పెళ్ళిళ్ళయి పోతే చాలు! తన సంగతి తరవాత ఆలోచించొచ్చు!

మెట్లమీద అడుగుల చప్పుడైంది. ఆలోచనల్లోంచి తేరుకుని కళ్ళు తుడుచుకుంది పద్మ. ముఖం గంటు పెట్టుకుని వచ్చేడు శంకరం.

"నీ వ్యవహారం నాకేమీ నచ్చలేదక్కా!" అన్నాడు శంకరం సీరియస్‌గా.

నవ్వింది పద్మ నన్నగా. సమాధానం చెప్పడం ఇష్టం లేకపోతే నవ్వి ఊరుకోడం పద్మ స్వభావం అని శంకరానికి బాగా తెలుసు. ఎన్ని విధాల బతిమాలినా చెప్పదని కూడా అత నెరిగినదే! ఎదురుగా చాపమీద చతికిలబడిపోయి, అక్కగారి ముఖంలోకి తదేకంగా కొన్ని క్షణాలు చూసేడు.

"అక్కా! ఒక మాట అడిగేదా?" అన్నాడు.

"అడగరా!" అంది పద్మ ఎటో చూస్తూ.

"అవతల సీ తక్క పెళ్ళి చూపులు అవుతున్నాయి. ను వ్విక్కడ ఒంటరిగా డాబామీద నీకేమీ పట్టనట్లు కూచున్నావు. వచ్చిన నలుగురూ ఏమనుకుంటారు?" అన్నాడు శంకరం నిష్ఠురంగా.

మరోసారి నవ్వేసింది పద్మ. "ను వ్వెట్టి పిచ్చి నన్నాసివిరా శంకూ! ఏమీ తెలీదు నీకు! నే నక్కడ లేకపోయినా పెళ్ళిచూపుల తతంగం ఆటంకం లేకుండా జరిగిపోయింది. అసలు ప్రమాదమంతా అక్కడ నే నుంటేనే వస్తుంది" అన్నది.

ఉలిక్కి పడ్డాడు శంకరం - "ఏమి టక్కా ను వ్వనేది?" అనగలిగేడు.

"ఉన్న మాటేరా శంకూ! నే నక్కడే ఉంటే వచ్చిన పెళ్ళికొడుకు దృష్టి నామీద పడుతుంది. వాళ్ళు సీత సంగతి మరిచిపోయి నా గురించి మాట్లాడతారు. నేనే నచ్చా నంటారు! అలా జరిగితే పెద్దగా చదువు, ఆకట్టుకునే అందం లేని సీత గతే మవుతుంది? ఏమవుతుందో గతంలో రెండుసార్లు అనుభవం అయింది. మళ్ళీ మళ్ళీ అదే రకంగా సంబంధాలు బెడిసికొడితే సీత మనసు ముక్కలైపోయింది. అందుకే నేను దూరంగా ఉంటున్నాను. నేను కనిపించకుండా ఉంటే బావుండునని సీతా అనుకుంటుంది, నాన్నా అనుకుంటాడు. అమ్మని వదిలెయ్! ఆవిడకి ఏ అభిప్రాయమూ ఉండదు. ఏనాడో ఆవిడ ఒక జడపదార్థ మైపోయింది" అన్నది పద్మ.

శంకరం నోట మాట రాలేదు కొంతసేపు. ప్రతిమలా ఉండిపోయేడు.

"అలాని ను వ్వనుకుంటున్నావా? లేక వా ళ్ళెప్పుడేనా అన్నారా?" అని ప్రశ్నించేడు.

"ఎలా అయినా ఒకటేరా! ఇప్పు డవన్నీ తర్కించుకోవటం అనవసరం. జరగబోయేదాన్ని గురించి ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయి" అంది పద్మ.

"అంత క్లిష్టమైన సమస్యలు ఏ మున్నాయని బాధపడాలో బోధపడ్డం లేదక్కా నాకు!"

"బావుందిరా నీ తెలివి. డిగ్రీ చదువుతూ చదువుతూ సగంలో మానేసి, ఉద్యోగంలో ఎందుకు చేరావు నువ్వు? మానద్దురా అని శతపోరు పెట్టినా వినలేదు మరి. సంపాదనలో పడితీరాలని పట్టుబట్టావు! గవర్నమెంటు ఉద్యోగం తప్ప చెయ్యనని మొదట్నుంచీ అనేవాడివి. అలాంటిది ప్రైవేటు కంపెనీ అయినా స్థిరంగా ఉంటుం దన్న నమ్మకం లేకపోయినా, ఉన్న ఊళ్ళో ఉద్యోగం అని చేరిపోయేవు. కారణం ఏమిటో చెప్పు! నువ్వు బయటపడవు. కాని నాకు తెలుసురా నీ మనసు! మన బతుకులు బజారున పడ్డం ఇష్టం లేక! అడ్డమైన అలవాట్లకీ బానిసైపోయిన నాన్న ఆయన సంపాదనా మనల్ని గౌరవంగా బతకనివ్వదనేగా? నా సంపాదన ఒక్కటే ఆధారంగా ఉండటం నే నొక్కదాన్నే శ్రమపడి ఇంతమందిని బతికించటం చూసి సహించలేకేగా? చెప్పరా! నిజం కాదంటావా?"

త లొంచేడు శంకరం. "నాకు సిగ్గేస్తోం దక్కా! నలుగురిలో త లెత్తుకు తిరగటానిక్కూడా భయంగా ఉంది" అన్నాడు.

"దేనికిరా, అంత తప్పేం చేశానని?" అంది పద్మ ఆశ్చర్యంగా.

"పెద్ద దానివి. నీ పెళ్ళి గురించి మరిచిపోయి మిగిలిన వాళ్ళ పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు అమ్మా, నాన్నా! అందుకు నీ సంపాదనంతా కూడబెడుతున్నావ్! ఇ దెక్కడి అన్యాయం అని అడగలేని పరిస్థితుల్లో ఉన్నాం నువ్వూ, నేనూ! అవతల పెళ్ళిచూపులు జరుగుతుంటే ని న్నక్కడ ఉండమని కూడా ఎవరూ అనలేదు. ఇంత దారుణం ఎక్కడేనా ఉంటుందా? సంపాదించే పెద్ద కూతుర్నే అంటరాని మనిషిగా చూసే కన్న వా ళ్ళెక్క డుంటా రక్కా - మన కొంపలో తప్పించి?" అన్నాడు శంకరం ఆవేశంగా.

"ప్రేమాభిమానాలు లేక కాదురా! ఆర్థిక పరిస్థితులు అలాంటివి. నీకన్నా ముందు పుట్టిన అక్కయ్యలు ముగ్గు రున్నారు నీకు. నాకు డిగ్రీ చెప్పించారు. ఒక్క మగ పిల్లాడివి గనక, నిన్ను చదివించక తప్పదు గనక చదివించారు. మధ్య ఇద్దరికీ ఆ యోగం లేదు. చదివించలేకపోయారు. నాకు ఉద్యోగం ఉంది. నువ్వేమో కావాలని చదువు మాని సంపాదనలో పడ్డావు. అక్క లిద్దరి పెళ్ళిళ్ళూ మన సాయంతో జరిగిపోతే పెద్ద బరువు దిగిపోతుందన్న ఆశ! ఆ తరవా తెప్పుడో నాకు తగినవాడు దొరక్కపోడన్న నమ్మకం! ఇలా ఆలోచించడం న్యాయమే అనిపిస్తుంది నాకు!" అన్నది పద్మ గంభీరంగా.

"నీ దృష్టిలో న్యాయమేనేమో! కాని నా మట్టుకి నాకు ఇది కేవలం స్వార్థం! తన బాధ్యత లేమిటో మరిచిపోయి, అతిహీనంగా ప్రవర్తించి అసమర్థుడైపోయాడు నాన్న! చిట్ట చివరికి ఆ బాధ్యతలు దించుకుందుకి నీ భవిష్యత్తుని బలి పెడతాడా? లోకం ఏమనుకుంటుందో అన్న భయం కూడా లే దా పెద్దమనిషికి! ఛీ!"

"ఎందుకురా, శంకూ, అంత ఆవేశం?"

"ఆవేశం కా దక్కా! బాధ. మొత్తం బరువంతా నీ నెత్తిమీదికి నెట్టి, తనుమాత్రం హాయిగా విలాసాల్లో మునిగి తేలుతున్నా డా పెద్దాయన. మౌనంగా భరిస్తున్నావన్న కృతజ్ఞత గానీ, నీకు అన్యాయం జరగతోందన్న ఆలోచన గానీ లేదు ఆ రాతి మనిషికి."

"పోనీలేరా! ఇప్పు డేమైపోయింది? పెద్ద కూతుర్ని గదా! భరించడం నా బాధ్యత. నువ్వే నా స్థానంలో ఉంటే ఇదే చేసేవాడివి. తప్పించుకు పారిపోలేవుగా? అనవసరంగా బాధపడి మనసు చెడగొట్టుకోకు. పద. కిందికి వెడదాం" అంటూ లేచింది పద్మ.

శంకరం కూడా లేచి నిలబడ్డాడు. "పది వేలు అడిగారు వాళ్ళు" అన్నాడు.

"లాంఛనాలో?" అడిగింది పద్మ.

"అవన్నీ కలుపుకునే అడిగారు."

"నాన్న ఏమన్నాడు?"

"ఎగిరి గంతేసి మరీ ఒప్పుకున్నాడు. ఆయన సొమ్మేం పోయింది? తన కష్టార్జితం అయితే గదా! అయినకాడికి ఆడపిల్లల్ని ఒదిలించుకోవటం కావాలి. ఆ తరవాత ఆయనకి కావలసినంత స్వేచ్ఛ!"

నిర్జీవంగా నవ్వింది పద్మ. భారంగా మెట్లవైపు కదిలింది. అనుసరించేడు శంకరం దిగులుగా.

** ** **

నాగమణి పద్మ మొహంలోకి గుచ్చి గుచ్చి చూసింది. "పద్మా! ఇన్ని మాట లొద్దు. అవుననో, కాదనో జవాబు చెప్పు, అంతే! నీ భవిష్యత్తు పట్ల నీకు ఒక అభిప్రాయం లేదా? ఎప్పటికీ ఇలాగే ఉండిపోదల్చుకున్నావా?" అ నడిగింది.

"నా అభిప్రాయం తెలుసుకుని ఏం చేస్తావు, నాగమణీ?" అన్నది పద్మ ఎటో చూస్తూ.

"ఏమైనా చేస్తాను. చేతకా దనుకోకు. నీ శ్రమఫలం దోచుకుతింటూ, కండలు పెంచుకుంటూ తమ వంతు బాధ్యతలు

## శిలల నుంచి సంగీతం

శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః అన్నట్లు సంగీతానికి ముగ్ధులు కాని వారు కొంచెం బండ మనుషులని చెప్పాలి. ఒంటరిగా ఆలోచనలతో సతమత మవుతున్న వ్యక్తి చక్కటి సంగీతంతో సేదదీరగలడంటే అతిశయోక్తి కాదు. కాని ఖర్చు లేకుండా శ్రవణ పేయమైన సంగీతాన్ని మధ్యప్రదేశ్‌లోని బస్తర్ జిల్లాలో కుటుంబసార్ ప్రాంతంలో ఉన్న కొన్ని గుహలలోని శిలలు వినిపిస్తాయి. అక్క డుంటే జనం వాటినుంచి వెలువడే సంగీత స్వరాలకు ముగ్ధు లవుతున్నారు. ఇవి ఎలా వస్తున్నాయని ఇంతవరకూ పరిశోధన జరపనప్పటికీ, మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ వారు సుమధురమైన ఆ సంగీతాన్ని ఓ కేసెట్‌లో టేప్ చేశారట!

-పి. పాండరి [హైదరాబాదు]

మరిచిపోయిన నీ కుటుంబంలో ప్రతి ఒక్కరినీ ఉతికి ఎండేస్తాను. నువ్వు నీ గురించి ఆలోచించకుండా వాళ్ళందరి బాగోగులకోసం గానుగెద్దులా కష్టపడుతున్నంత కాలం, నీ సంపాదనంతా దోచిపెడుతున్నంత కాలం నిన్ను పట్టించుకోరు. నన్ను చూడు పద్మా! నేనూ నీ వయసుదాన్నే! పెళ్ళయి నాలుగేళ్ళయింది. ఇద్దరు బిడ్డల తల్లి నయ్యాను. నా పిల్లలకోసం, నా సంసారం కోసం ఆనందంగా ఉద్యోగం చేసుకుంటున్నాను. తృప్తిగా బతుకుతున్నాం. నాకూ కన్న వాళ్ళున్నారు. నీ వాళ్ళలా అంత స్వార్థపరులే అయి ఉంటే నేనూ నీలాగే ఉండేదాన్ని" అన్నది నాగమణి.

"స్వార్థం కాదు, నాగమణీ! పరిస్థితుల ప్రభావం! అయినా అందరి తల్లిదండ్రులూ ఒకలా ఉండరు" అంది పద్మ.

"అవును. ఉండరు. కాని నీ తండ్రి లాంటి వాడు లక్ష కొకడు తేలుతాడు. అలాంటి వాడికి నరైన జోల్టిస్తే గాని బుద్ధి రాదు పద్మా! నా మాట విను. నీ పెళ్ళి విషయంలో నువ్వు స్వతంత్రించకపోతే జీవితమంతా ఇలాగే ఉండిపోవా ల్సొస్తుంది. వయస్సు దాటిపోయేక ఏమనుకున్నా లాభం ఉండదు" అంది నాగమణి, ఆమెని ఒప్పించే ధోరణిలో.

లంచవర్లో భోజనాల దగ్గిర సాగుతోంది ఈ చర్చంతా. ఆ గదిలో నాగమణీ, పద్మా - ఇద్దరే ఉన్నారు. అందుకే స్వేచ్ఛగా మాట్లాడుకోసాగేరు. మిగిలిన వాళ్ళందరూ కాంటీన్‌కి వెళ్ళేరు.

అంతలో సుబ్బారావు సుడిగాలిలా దూసుకొచ్చేడు రూంలోకి. "దిసీజ్ ఫర్ లేడీస్ ఓన్లీ! కెన్ యు హియర్ మి మిస్టర్ సుబ్రావ్?" అన్నది నాగమణి సీరియస్‌గా.

"నాకు తెలుసండీ బాబూ! తెలిసే వచ్చాను. ఇవ్వాళ మా ఆవిడా, నేనూ భీకరంగా దెబ్బలాడుకున్నాం. అందుచేత భోజనం లేదు. మనం భార్యామణిపైన అలిగి వచ్చితిమిలెండు. ఏదో రకంగా రెండు ముద్దలు పడెయ్యపోతా రా అని వచ్చాను. వెధవది కాంటీన్‌లో వెజిటబుల్ పులావుట స్పెషల్! ఐస్‌లో ఉంచినట్లున్న గారెలూ, బజ్జీలూ అరిగి చావవు నాకు. గాస్టిక్ ట్రబుల్ గదా! కారాలూ, మసాలాలూ లేని కూర ఉంటే... అతిథిని వచ్చాను. అటుపైన మీ ఇష్టం!" అంటూ ఓ కుర్చీలో కూర్చున్నాడు సుబ్బారావు.

నాగమణి ఓ కారియర్ గిన్నెలో అన్నం, కూర వేసి అతని ముందుకి తోసింది. పద్మ సాంబారు గిన్నె ఆ పక్కగా ఉంచింది. సుబ్బారావు ఆరగిస్తున్నాడు.

"ఎలాగైనా మీ ఆడాళ్ళు గొప్ప దయార్ద్ర హృదయులండీ! అందుకే అలనాటి పెద్ద వెధవలు 'తిండీమ తల్లీ' అన్నారు మిమ్మల్ని. కంగారు పడకండి. ఇది తెలుగు శ్లోకం! మక్కీకి మక్కీ ట్రాన్స్‌లేషన్!" అన్నాడు సుబ్బారావు.

నాగమణీ, పద్మా గొల్లున నవ్వేరు.

"హియ రీ జే ఫ్లాష్!" అ నరిచాడు సుబ్బారావు ఉన్నట్టుండి.

"శేషగిరికి పెళ్ళవలేదు. అదేనా?" అడిగింది నాగమణి.

"నా ఉత్సాహమంతా నీళ్ళపాలు చేస్తున్నారు నాగమణిగారూ! మధ్యలో అడ్డుతా రేమిటి మీరు? సరే గానీండి, ఈ పొటాటో - టొమాటో కాంబినేషన్ కూర చాలా బావుందండీ! చూడండి, మా ఆవిణ్ణి ఓ నాలు గాదివారాలు మీ దగ్గరికి పంపిస్తాను ట్యూషన్ చెప్పండి - కేవలం పాకశాస్త్ర పాఠాలు మాత్రమే! ఆ మహాతల్లి - అదేనండీ - మదీయ అత్తశ్రీ - ఎలా పెంచిందో ఏమో మరి, నా భార్యాశ్రీకి సుష్టుగా తినటం తప్ప వండటం రాదండీ! పనవకపోతే ఇక్కడ ఆఫీసరుగారి తిట్ల తాపులు! సమయానికి దగ్గర లేకపోతే అక్కడ ఇంట్లో మాడుపోవులు! మద్దెల బతుకైపోయింది నాది!" అని వాపోయేడు సుబ్బారావు.

"మీరు తెచ్చిన ఫ్లాషేదో వెలిగిస్తారా, మమ్మల్ని చేతులు కడుక్కుని అవతలికి పొమ్మంటారా?" అన్నది పద్మ.


"బాగా అన్నావు!" అంది నవ్వుతూ నాగమణి.

"అమ్మయ్య! ఇప్పటికి ఈ ఫ్లాష వెలుగు సోకాల్సిన మనిషి నోరు విప్పిందండీ! ఇక కానుకోండి! మన శేషగిరి 'ప్రేమించు ప్రేమకై' అనే 'ప్రేమిస్టు' సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా అమల్లో పెట్టదల్చుకున్న కారణంచేత ఇన్నేళ్ళూ బ్రహ్మచారిగా జీవయాత్ర సాగిస్తున్నాడు. సదరు 'ప్రేమిజం' ఒక్కటే తన భావి సంసార సామ్రాజ్యానికి చెక్కుచెదరని పునాది అవుతుందని అతగాడి విశ్వాసం!" అన్నాడు సుబ్బారావు, గొంతులో సాధ్యమైనంత గాంభీర్యం పులుముకొని.

"అవన్నీ పక్కన పెట్టండి సుబ్రావ్‌జీ! అతగాడికి పనికొచ్చేది 'పెళ్ళిజం' ఒక్కటే! నచ్చినదాన్ని కట్టుకుని కాశ్మీర్, పంజాబో వెళ్ళి డ్యూయెట్లు పాడుకోమని చెప్పండి! మా కెందు కీ గోల?" అన్నది నాగమణి విసుగ్గా.

"చాల్లే నాగమణీ! హనీమూన్‌కీ, డ్యూయెట్లకీ ఆ రెండు రాష్ట్రాలే దొరికేయా నీకు? అక్కడ ఈ ప్రేమిజాలూ, పెళ్ళిజాలూ చెల్లవు! మరో మంచి ప్లేసు వెతుక్కోమనండి!" అంది పద్మ చిరునవ్వుతో.

"ఆ సలహా ఎలాగూ ఇస్తాలెండి గురుడికి. ముందు పెళ్ళవాలి కదా! అది జరగాలంటే ఈడూ జోడైన పిల్ల వచ్చి 'ప్రేమకై ప్రేమించి



ఫోటో - కె. కుమార్ [హైదరాబాదు]

వచ్చాను శేషగిరీ' అని చెప్పాలి. అంతే! గురుడు మరుక్షణం తాళి పట్టుకుని తయారైపోతాడు. దటీజ్ శేషగిరి! ఈ రహస్యం నేను కనిపెట్టింది కాదు! అతగాడు బయట పెట్టిందే." సుబ్బారావు పద్మ వైపు దొంగచూపులు చూసేడు, ఆమె ముఖంలో భావాలకోసం.

కాని ఆమె ముఖం భావరహితంగా ఉంది.

సుబ్బారావు తినటం ముగించి సింక్ దగ్గరికి వెళ్ళి చేయి కడుక్కుంటూ - "సో! థాంక్యూ ఫర్ యువర్ హాస్పిటాలిటీ! పద్మగారూ! మీది బి.ఏ.లో స్పెష లింగ్లీష మెయిన్ అనుకుంటాను? ఈ హాస్పిటాలిటీ అన్న మాట 'హాస్పిటల్' అనే దాని సంతాన మంటారా? అయితే ఆ రెండింటికీ ఏమిటి సంబంధం అర్థంలో?" అన్నాడు.

"నా బొంద! ఏమిటండీ మీ రిలా నా బుర్ర రామకీర్తన పాడిస్తున్నారు? అవతల టేబుల్‌మీద బొచ్చెడు ఫైల్సు పడున్నాయి! ఖాళీగా ఉన్నప్పుడు మాట్లాడుకుందాం లెండి!" అన్నది పద్మ.

"సుబ్రావ్ జీ! మీరు మా కో ఉపకారం చెయ్యాలండీ!" అన్నది నాగమణి.

"చెప్పండి!" అన్నాడు సుబ్బారావు ఉషారుగా.

"మరేం లేదు! మీరు మీ ఆవిడతో భీకరపోరాటం సాగించిన రోజు ఆఫీసుకి సెలవు పెట్టండి! వచ్చేసి మమ్మల్ని కాల్చుకు తినకండి."

"నో యూజ్ నాగమణిగారూ! అది మాత్రం ఇంపాజిబుల్! ఇంటికన్న ఆఫీసే నా ప్రశాంతతకి కంచుకోట! సో! మరి యొక్క వరంబు కోరుకొనుడు" అన్నాడు సుబ్బారావు.

నాగమణీ, పద్మా ఒకరి నొకరు చూసుకున్నారు. చిరునవ్వులు విసురుకున్నారు.

** ** **

పద్మ తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది - "అమ్మా!" అనగలిగింది.

"ఈ సంగతి నాకు కొత్తగా తెలిసిం దేమీకాదు పద్మా! పదేళ్ళ క్రితమే తెలిసింది. నా తలరాత అని సరిపెట్టుకున్నాను. అంతకు మించి నేను చెయ్యగలిగిం దేముంది? నిత్యం ఆ మనిషితో ఘర్షణకి దిగి, ప్రశాంతంగా ఉన్న ఇంటిని నరకం చేసుకోవటం, ఎదుగుతున్న మీముందు ఆయనా, నేనూ కూడా చులకనైపోవటం ఇష్టంలేక బాధంతా భరించానే తల్లీ! కట్టుకున్న పెళ్ళాన్ని గురించే పట్టించుకోకుండా, మరో సంసారం నడుపుతున్న ఆ రాక్షసుడు కన్న బిడ్డల మంచి చెడ్డలు ఆలోచిస్తాడా? ఒకనాడు కాకపోతే మరోనాడైనా మార్పొస్తుందని ఇన్నేళ్ళూ ఎదురు చూశా నమ్మా! ఇహ ఆశలేదు. ఇల్లు గడవటం, చెల్లెళ్ళ పెళ్ళి బాధ్యతలూ నీ నెత్తిన వేసుకుని మోస్తున్నావు. నీ గురించి నువ్వు ఆలోచించుకోకుండా, నువ్వు చేసే త్యాగాన్ని గుర్తించే మనసు కూడా లేదమ్మా ఆయనకి! తప్పిందే చాలని ఇల్లు పట్టకుండా పూలరంగళ్ళా ఊరేగుతున్నాడు.

నా మాట విను. మీ నాన్న ని న్నో ఇంటిదాన్ని చేసి సాగనంపుతా డన్న ఆశ తుంచేసుకుని నీ దారి నువ్వు చూసుకోమ్మా! సీత పెళ్ళి అవనే అయింది. లక్ష్మి పెళ్ళంటావా? దాని తలరాత ఎలా ఉంటే

అలా జరుగుతుంది. పిచ్చిదే, వెర్రిదే తమ్ముడి కో ఉద్యోగం ఉండనే ఉంది. మీ నాన్న పెట్టకపోయినా ఓ పూట తిండైనా పెట్టగలడు వాడు. వాడిది పెద్ద మనసు పద్మా! వాడి బాధంతా నీ గురించే. నే నేదో పిచ్చివాగుడు వాగుతున్నా ననుకోకుండా బాగా ఆలోచించు. నువ్వు సరైన నిర్ణయం తీసుకోగలవన్న నమ్మకం నాకుంది.

"ఒక్క సంగతి గుర్తుంచుకో పద్మా! అనుభవంతో చెబుతున్నాను. పరుల సంపాదన అనుభవించటానికి అలవాటు పడిపోయి, సుఖాలు మరిగిన మీ నాన్న లాంటి వాళ్ళకి కష్టం విలువ అర్థం కాదు. కనీసం అర్థం చేసుకుందు క్కూడా ప్రయత్నించరు. అటువంటప్పుడు తెలియజెయ్యటం మన ధర్మం. తిని కూచుంటూ, నాలు గ్గోడలకే అంకితమైపోయిన నా కా అవకాశం లేదు. బాధ్యతలు మోసే నీకుంది. అందుకే చెప్తున్నాను" అన్నది సుందరమ్మ.

తల్లిని ఆరాధనగా చూసింది పద్మ. సుందరమ్మ కూతురి తల నిమిరి, డాబా దిగి వెళ్ళిపోయింది నెమ్మదిగా. కొంతసేపు అటే చూస్తూ ఉండిపోయింది పద్మ - కన్నార్పకుండా.

"అక్కా! నీతో ఓ తమాషా మనిషి గురించి చెప్పాలని అరగంట పర్మిషన్ పెట్టి పరిగెత్తుకొచ్చే ననుకో!" అంటూ పద్మ కెదురుగా చతికిలబడ్డాడు శంకరం.

"ఇంతకీ ఎవర్రా అతను?" అడిగింది పద్మ.

"శేషగిరిట! మీ ఆఫీసులోనే పని చేస్తాడట! ఇవ్వాళ మీ కొలీగ్ సుబ్బారావుగారు కనిపించి తెగ వర్ణించి చెప్పా డనుకో! నువ్వెప్పుడూ చెప్పావు కాదేం?" అంటూ చెప్పటం ప్రారంభించాడు శంకరం.

ఓపిగ్గా విన్నది పద్మ.

"ఆయన కోరుకున్నట్లు 'నీ ప్రేమకోసం ప్రేమించాను' అని చెప్పగలిగే అమ్మాయి నిజంగా అదృష్టవంతురాలే అక్కా! నేనే ఆడపిల్లనైతే మాత్రం విషయం తెలిశాక ఇంటి కస్తా ననుకున్నావా? నో! నరానరి శేషగిరి దగ్గరికే పరిగెట్టేవాణ్ణి! వెధవది, మగ బతుకైపోయింది" అన్నాడు శంకరం పద్మ మొహంలోకి సెర్చింగ్‌గా చూస్తూ.

పద్మ ఆలోచనలో పడింది.

ఛీ! ఏం బతుకులు? బతుకుతెరువూ, గౌరవంగా బతకటం రెండూ ఈ మధ్య తరగతి వాళ్ళకి సమస్యలే! వీటికి తోడు నైతిక పతనాలూ, అదనపు సుఖాలమీద వ్యామోహం! ఇవన్నీ కలిసి ఆత్మాభిమానాన్ని కూడా చంపేసి, సిగ్గు ఎగ్గూ లేని అవకాశవాదులుగా మార్చేస్తున్నాయి. అసలు ఈ సుబ్బారావుకి ఇదేం పోయేకాలం? తనతో శేషగిరి గురించి చెప్పినప్పుడు చలించలేదని కాబోలు తమ్ముడు శంకరానికి ఊదరకొట్టేడు. శంకరం పట్టి అమాయకుడు. తనమీద వల్లమాలిన ప్రేమ. ఎలాగైనా త న్నో ఇంటిదాన్ని చెయ్యాలన్న తాపత్రయం! ఆ తాపత్రయం కొద్దీ శేషగిరి మానియా తెలిగానే సింపుల్‌గా 'ప్రేమించాను ప్రేమకై' అనే రెండు మాటలు అప్పజెప్పేస్తే పెళ్ళయిపోతుంది గదాని హింటివ్వడానికి వచ్చేశాడు.

కాని శేషగిరి పట్ల ఏ అభిప్రాయమూ లేకుండా వెళ్ళి ఆ మాట అనడం ఆత్మవంచన అవుతుంది. అంతేకాదు, అతన్ని మోసం చెయ్యడం కూడా అవుతుంది. చివరంటూ గడపాల్సిన దాంపత్య జీవితం ఆత్మవంచనతో, మోసంతో ప్రారంభించడం న్యాయం ఎలా అవుతుంది? పరిస్థితుల ప్రభావానికి తల ఒగ్గటానికి త నంతటి సంస్కారం లేనిది కాదు!

ఇలా ఆలోచిస్తున్న పద్మకి తల్లి మాటలు గుర్తుకు రాసాగిన్నై.

దీర్ఘాలోచనలో పడిపోయిన పద్మని డిస్టర్బ్ చెయ్యడం ఇష్టం లేక మౌనంగా ఉండిపోయేడు శంకరం.

** ** **

ఆశ్చర్యంగా చూసేడు శేషగిరి ఆమెవైపు.

పద్మ తలొంచుకుంది ఆ చూపులు భరించలేక.

చాలాసేపు ఎవరి నోటి వెంటా మాటల్లేవు.

"పద్మా! మీ కుటుంబ పరిస్థితులే కాదు - నీ గురించి కూడా నాకు పూర్తిగా తెలుసు. ఏ ఒత్తిళ్ళకి లొంగిపోయి ను వ్విలా నాతో చెప్పగలిగేవో, చెప్పటానికి ముందు ఎంత మానసిక వ్యథకి లోనయ్యావో నే నర్థం చేసుకోగలను. నే నిప్పుడు కాలేజీ చదువుల నాటి పరిపక్వత లేనివాణ్ణి కాదు. బాధ్యతల బరువులు, కలతలు, కన్నీళ్ళు కలబోసుకున్న అనుభవా లెన్నో నా జీవితం నిండా ఉన్నాయి పద్మా! నేను నీలాంటి మధ్య తరగతి మనిషినే! అలనాటి రంగమణి, మేరీ, కామిని, అలివేలు మంగ, జ్యోతీల సో కాల్డ్ ప్రేమ మైకంలో లేను. అప్పటి నా ఆలోచనలు తలుచుకుంటేనే నవ్వొస్తోంది. సో, లీవిట్!

"ఇప్పుడు మనం ఇంతకాలం తరువాత ఎదుటపడ్డాం గనక ముసుగులు తీసేసి మాట్లాడుకుందాం పద్మా! 'ప్రేమించాను ప్రేమకై' అని చెప్పగలిగిన అమ్మాయినే చేసుకుంటానన్న నా దిక్కుమాలిన షరతుని విత్ డ్రా చేసేసుకున్నాను. కనకన నువ్వు చెప్పిన డైలాగ్‌ని వెనక్కి తీసుకో! నౌ యు ఆర్ ఫ్రెష్! నీ తోటి ఉద్యోగిగా, వ్యక్తిగా, నీ బాధ్యతలు పంచుకోగలనన్న హామీ ఇచ్చే మనసున్న మనిషిగా నేను నీకు నచ్చితే చెప్పు, పద్మా! కెన్ యు మారీ మి?" అన్నాడు శేషగిరి.

పద్మ కళ్ళు సజలా లయ్యాయి. కంపించే చేతులతో శేషగిరి చెయ్యి అందుకుంది.

అతను పులకించాడు. ★


వేణు చెప్పాడు - "ఆ ముందు వెళుతున్న ఏ.ఐ.టి. త్రిబుల్‌నైన్ ఆటోను ఫాలో చెయ్యండి."

ఫియట్ ముందుకు దూకిస్తూ ఆశ్చర్యంగా అన్నది విష్ణుప్రియ - "ఆ ఆటోలో ఎవ రున్నారు, ఇంతకూ మీ రెవరు?"

"ఆ ఆటోలో ఇంటర్నేషనల్ స్మగ్లర్ నెబ్రాస్కా పారిపోతున్నాడు. ఇక నేను క్రైంబ్రాంచ్ స్పెషల్ సీక్రెట్ ఏజెంట్‌ని."

విష్ణుప్రియ అతడి వంక ఉద్వేగంగా చూసింది.

"మీరు స్పెషల్ సీక్రెట్ ఏజెంట్ కదా! మరి తుపాకీ లేదేం?"

వేణు వెంటనే సర్వగర్వంగా నవ్వాడు. ఓ సిగరెట్ పైకి తీసి చూపిస్తూ చెప్పాడు.

"ఇదేంటో తెలుసా? అత్యాధునిక మినీ ఎక్స్‌ప్లోజివ్. చూడటానికి మామూలు సిగరెట్‌లా కనపడుతోంది. కాని దీన్ని కనక ప్రయోగిస్తే పెద్ద పేలుడు సంభవించి వందమంది మరణించటం ఖాయం."

"వ్వాట్?"



అదిరిపోతూ అడిగింది విష్ణుప్రియ. ఆమె ఇలాంటి విశేషాలన్నీ ఇంగ్లీష్ సినిమాల్లో మాత్రమే చూసింది. ఇప్పుడు నిజంగా చూస్తోంది. వేణు 'మినీ ఎక్స్‌ప్లోజివ్' గురించి మరింత వివరంగా చెప్పసాగాడు.

తరువాతి కథ త్వరలో ప్రారంభమయ్యే

ప్రేమాయ నమః

సీరియల్‌లో తెలుసుకోండి.